క్లుప్తంగా

నాయిబ్రాహ్మణ సంఘం మండల కమిటీ ఎన్నిక



నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

కందుకూరు: తెలంగాణ నాయిబ్రాహ్మణ సంఘం కందుకూరు మండల నూతన అధ్యక్షుడిగా పొడిపాల రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ప్రస్తుత అధ్యక్షుడు బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ఆ ఎన్నుకున్న సంఘాన్ని గురువారం ప్రకటించారు. కమిటీ చైర్మన్‌గా గడెల రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.విష్ణు, ఉపాధ్యక్షుడిగా గడెల కృష్ణకుమార్, కోశాధికారిగా గణపురం శివకుమార్, సభ్యులుగా డి.గణేష్, ప్రశాంత్, అనిల్, మహేందర్, అంజయ్య, యాదయ్య తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూములను పేదలకు పంచాలి

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలం కుర్మల్‌గూడలోని సర్వేనంబర్ 80/1లో ఉన్న 16 ఎకరాల మిగులు భూమిని ఇళ్లు లేని నిరుపేదలకు పంపిణీచేయాలని ఇండియా యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రాల శేఖర్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ నారాయణరెడ్డి, కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ఇందిరాదేవికి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అర్హులైన పేదలందరికీ 60గజాల చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాలోతు గోవింద్‌నాయక్, తెలంగాణ రాష్ట్ర ఆఫీస్ సెంటర్ ఇన్‌చార్జ్ జ్యోతి, ఏఐడబ్ల్యూటీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.జాన్సీ, పి.సురేష్‌భాను, గంధం లక్ష్మీనారాయణ, ఏ.లక్ష్మీ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జిని కలిసిన మాజీ మేయర్



శివసేనారెడ్డితో మాజీ మేయర్ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: సంస్థాగత నిర్మాణంలో భాగంగా జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని గురువారం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. ఆమె మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల పరిశీలకులుగా ఉన్న నేపథ్యంలో పార్టీ సమావేశాలు, చర్చలపై పార్టీ తీసుకోవాల్సిన నిర్ణయాలపై తయారుచేసిన రిపోర్టులు శివసేనారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చెల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



రాంచందర్‌రావును సత్కరిస్తున్న నాయకులు

హుడాకాంప్లెక్స్: బీజేపీలో సామాన్య కార్యకర్తలు సైతం ప్రధాని పదవి వరకు ఎదగొచ్చని మహిళా నాయకురాలు సంధ్యారాణి అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావును కార్యాలయంలో ఆమె ఘనంగా సత్కరించారు. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఎదిగిన రామచందర్‌రావు సారథ్యంలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఈ సందర్భంగా ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు బొమ్మ రఘురామనేత తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

వనస్థలిపురం: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం వనస్థలిపురంలో శ్రీ సద్గురు భం అన్వరానంద బాబా సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ అన్వరానంద బాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, ముద్దగొని లక్ష్మీప్రసన్న హాజరై పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బద్దం వినోద్‌రెడ్డి, నాయకులు కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, రఘుగౌడ్, వెంకీ, సంజీవరెడ్డి, సత్తిరెడ్డి, సుజిత్, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, నర్సింగ్, రాంమోహన్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, సుబ్బారాయుడు, పెద్దిరాములు పాల్గొన్నారు.

సామాన్యుడి సమస్యలు పట్టవా?

- అకారణంగా దరఖాస్తుల తిరస్కరణ
- చులకనగా చూస్తున్న కార్పొరేషన్ అధికారులు
- బడాబాబులకు కొమ్ముకాస్తున్న వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- షెడ్డు కూల్చివేతపై నాయకుల నిలదీత



బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ భవనం

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్‌లో పాలకుల పదవీకాలం ముగిసి ఆరు నెలలు దాటింది. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఇంత వరకు బాగానే ఉన్నా.. కార్పొరేషన్ అధికారులు తీరుపై ప్రాంత ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. సామాన్యుల సమస్యలు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. కబ్జాదారులు, అక్రమార్కులు, బడాబాబులకు కొమ్ము కాస్తున్నారని బాహటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. కార్పొరేషన్‌లోని అధికారుల చుట్టూ తిరిగినా.. పనులు కావటం లేదని దరఖాస్తు దారులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ అనుమతి, ఇంటి నంబర్లు, శానిటేషన్ తదితర వాటి అనుమతి కోసం అర్జీ పెట్టుకున్నామని, ఎలాంటి కారణాలు లేకపోయినా ఆఫీసుల చుట్టూ తిప్పుకొంటున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. లీగల్‌గా అన్ని పత్రాలు కలిగి ఉండి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి సమచారం ఇవ్వకుండా, రిజెక్ట్ చేస్తున్నారని వాపోతున్నారు. డబ్బులు ఇచ్చిన వారికో, బెదిరిస్తున్నవారికి పనులు చేసిపెడుతున్నారని మండిపడుతున్నారు. ఇదెక్కడి పాలనో అర్థంకావడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలకు డిమాండ్

మల్లాపూర్‌లో అనుమతులు లేకుండా షెడ్డు నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న కార్పొరేషన్ అధికారులు మూడు రోజుల క్రితం కూల్చివేశారు. అక్రమార్కులు, అన్యాక్రాంతులు, అనుమతి లేని కట్టడాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. ఇటీవల కాలంలో ఓ పార్టీ శ్రేణులు.. కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తాజాగా షెడ్డు కూల్చివేత ఘటనతో మా పార్టీకి చెందిన వారి కట్టడాలు ఎలా కూలుస్తారని మరోసారి కార్పొరేషన్‌ను ముట్టడించారు.

తప్పు చేయకపోతే భయమెందుకు?

ఒక పార్టీకి చెందిన నాయకులు బెదిరిస్తే.. కమిషనర్ ఎలా బెదిరిపోయారన్న చర్చ స్థానికంగా చర్చనీయాంశం అయింది. కమిషనర్‌తో పాటు అధికారులు తప్పు చేయకపోతే ఎందుకు బయపడుతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు తప్పులు చేస్తూ.. సమస్య రాగానే కాంట్రాక్టు సిబ్బందిని బలిచేసే అనుమానాలకు బలం చేకూరినట్లుగా మల్లాపూర్ కూల్చివేతలు ఉన్నాయని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. వ్యక్తిగత అవసరాల కోసం కొందరు పార్టీని వాడుకుంటున్నారని, ఇలాంటి విషయాలపై పార్టీ పెద్దలు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కమిషనర్‌ను నిలదీత

అక్రమ కట్టడాలని పేర్కొంటూ.. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా షెడ్డు, ప్రహరిని ఎలా కూల్చివేశారని ఓ నిర్మాణ దారుడు గురువారం కమిషనర్‌ను నిలదీశారు. దీనికి స్పందించిన కమిషనర్.. ఏమో తనకు తెలియదని, కూల్చివేసినందుకు తనను క్షమించాలని కమిషనర్ కోరినట్లు సమాచారం. అంతే కాకుండా.. కూల్చివేసిన షెడ్డుకు తగిన నష్ట పరిహారం ఇవ్వడంతో పాటు.. నిర్మాణ అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారని, కేసులు వద్దని కమిషనర్ చెప్పినట్లు కోరినట్లు తెలుస్తోంది. ఇది చర్చనీయంశంగా మారింది. ఇదే అంశమై కమిషనర్‌ను వివరణ కోరేందుకు యత్నించగా.. వారు అందుబాటులోకి రాలేదు.

ఎక్కడి నుంచో వచ్చి.. ఇక్కడ ఉంటారా?

- వెంటనే ఇళ్లను ఖాళీ చేయండి
- డబుల్ లబ్ధిదారులకు.. స్థానికుల మధ్య వాగ్వివాదం
- ఇరువురికి సర్దిచెప్పిన తహసీల్దార్ ఇందిరాదేవి
- సమస్య పరిష్కారానికి హామీ

మీర్‌పేట: 'ఎక్కడి నుంచో వచ్చి పూర్తికాని డబుల్ ఇళ్లలో ఎలా ప్రవేశిస్తారు? వెంటనే ఖాళీ చేయండి' అని డబుల్ బెడ్ రూం లబ్ధిదారులను స్థానికులు ప్రశ్నించగా.. 'తాము ఇక్కడి వారిమే. ఈ ఇళ్లకు లబ్ధిదారులమే. పట్టాలు ఉన్నా.. పదేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం' అని పేర్కన్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇది బాలాపూర్ మండలం మీర్‌పేటలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. లెనిన్‌నగర్ రైతుబజార్ వద్ద కొన్నేళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్న చోట, గత ప్రభుత్వం సర్వే చేపట్టింది. 255 మందిని అర్హులుగా పేర్కొంటూ డబుల్ ఇళ్ల నిర్మాణం చేపట్టింది. 2021 డిసెంబరులో నాటి మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి మొదటగా ఐదు బ్లాకులు నిర్మించి, లాటరీ ద్వారా 80 మందికి ఇళ్లు కేటాయించింది. మిగతా బ్లాకుల నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా.. గురువారం తెల్లవారుజామున నాడు గుర్తించిన లబ్ధిదారుల్లో 32 మంది పూర్తికాని ఇళ్లల్లోకి ప్రవేశించారు. విషయం తెలుసుకున్న స్థానికులు.. వారితో గొడవకు దిగారు. సమాచారం అందుకున్న మీర్‌పేట పోలీసులు అక్కడికి చేరుకుని, ఇళ్లల్లోకి ప్రవేశించిన వారిని బయటకు పంపించారు. తాము ఇక్కడి వారమేనని, తమకు పట్టాలు ఉన్నా.. అద్దె ఇళ్లల్లో ఉంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లబ్ధిదారులు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్యను పరిష్కరిస్తామని బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి హామీ ఇవ్వడంతో.. వారు ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయారు.



డబుల్ ఇళ్ల వద్ద పట్టాదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఇందిరాదేవి

ఆలయాల వద్ద వసతులు కల్పించండి



వాగామ్రి మాతాను దర్శించుకున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: బోనాల సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అవసరమైన వసతులు కల్పించాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. గురువారం ఐఎస్‌సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పలువురు ఆలయాల కమిటీ ప్రతినిధులకు దేవాదాయ శాఖ అధికారులు మంజూరు చేసిన చెక్కులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేసే ఆర్థిక సహాయాన్ని దేవాలయ అభివృద్ధి, బోనాల ఉత్సవాల ఏర్పాట్లకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ డివిజన్‌లోని పెద్దతోట వాగామ్రి మాతా ఆలయం సహా పలు అమ్మవారి దేవాలయాలను సందర్శించారు. ఈ నెల 20, 21న నిర్వహించనున్న బోనాల మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జంగం మధుకర్‌రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ అశోక్, దయా కాళి పాల్గొన్నారు.

గురువులను స్మరించుకోవాలి

బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్



శేషాచార్యులుకు పాదపూజ చేస్తున్న శ్రీరాములుయాదవ్

మీర్‌పేట: ప్రతి ఒక్కరూ గురువులను స్మరించుకోవాలని బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ పిలుపునిచ్చారు. గురుపూర్ణిమ సందర్భంగా గురువారం మీర్‌పేట జిల్లెలగుడాలోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో ప్రసిద్ధ గురువర్యులు శ్రీ కోమాండూరి శేషాచార్యులుకు శ్రీరాములు పాదపూజచేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. శిష్యుని జీవితాన్ని తీర్చిదిద్దే శిల్పి గురువు అన్నారు. మీర్‌పేట బీజేపీ-1, 2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్, కీసర గోవర్ధన్‌రెడ్డి, సోమేశ్వర్, గాజుల మధు, విక్కీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ద్రోహాన్ని గమనించాలి

గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి

కందుకూరు: బీఆర్ఎస్ రాష్ట్రానికి చేసిన ద్రోహాన్ని ప్రజలు గమనించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పోరాటాన్ని ప్రజలు గుర్తించారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కృష్ణా జలాల్లో తెలంగాణకు 36 శాతం చాలని, ఏపీకి 64 శాతం తీసుకోవచ్చని అంటూ ఆనాటి సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజానీకానికి ద్రోహం చేశారని విమర్శించారు. వారి హయాంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు మరింత ఎక్కువ వాటా దక్కేదన్నారు. తెలంగాణకు అదనంగా 220 టీఎంసీల నీటి వినియోగం పెరిగేదన్నారు. కమీషన్ల కక్కుర్తితో కాళేశ్వరం పేరుతో కూలేశ్వరాన్ని నిర్మించి లక్ష కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. అన్ని తప్పులు చేసిన తర్వాత కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలి

ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి



శిక్షణా శిబిరంలో పాల్గొన్న తహసీల్దార్ వేణుగోపాల్, ఆడిట్ ఆఫీసర్ వెంకట్

హుడాకాంప్లెక్స్: ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం చేపట్టాలని ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం సరూర్‌నగర్ మండల తహసీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో జ్యోతిక్లబ్‌లో బూత్‌స్థాయి అధికారుల ఎన్నికల శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి రెవెన్యూ అధికారులు నజరీనక్షా, ప్రవర్తన నియమావళి, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓటర్ల తొలగింపు, 18 ఏళ్ల వారికి ఓటుహక్కు కల్పించడం, పోలింగ్ బూత్‌లో బూత్‌స్థాయి ఏజెంట్లతో సమన్వయం కలిగి ఉండాలని కోరారు. బూత్‌స్థాయి అధికారి తన పోలింగ్‌బూత్ పరిధిలో ప్రతీ ఇంటికి వెళ్లి ఓటరుకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు కలిగి చిరునామా మారిన వారిని గుర్తించడం, దివ్యాంగులు, వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ కలిగేలా సహాయపడే విధానం, ఎన్నికల నియమావళిపై బూత్‌స్థాయి అధికారులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ ఆఫీసర్ వెంకట్, నాయబ్ తహసీల్దార్ జంగయ్య, ఆర్ఐ సహదేవ్ రెడ్డి, సూపర్‌వైజర్లు ఆనంద్‌కుమార్, మకత్‌లాల్, చెవుల నవీన్, ప్రవీణ్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి



రైతలకు యూరియా బస్తాలను అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: మండలంలోని రైతులకు ప్రాథమిక సహకార సంఘంలో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, అవసరం ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన యూరియా కొనుగుళ్ల ప్రారంభించి, రైతులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్తా 267 రూపాయలకు అందిస్తున్నట్లు తెలిపారు. అవసరం ఉన్న రైతులు, కౌలు రైతులు తమ ఆధార్‌కార్డు చూపించి యూరియా కొనుగోలు చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సొసైటీ ద్వారా యూరియా అందిస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి వెంకటయ్య, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ టేకుపల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనార్దన్, మాజీ వార్డు సభ్యులు మల్లేశ్, సొసైటీ పరిధిలోని రైతులు తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

చాదర్‌ఘాట్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. గురువారం ఓల్డ్‌మలక్‌పేటలోని పంచశీల్ లైబ్రరీలో మలక్‌పేట యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంటమాలజీ సిబ్బంది తరచూ దోమలు వ్యాపించే ప్రాంతంలో ఫాగింగ్ చేయాలని అన్నారు. కాలనీలు, బస్తీల్లో వైద్య సిబ్బంది తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైఫుద్దీన్ షఫీ, వాసు, అమరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బృందవన్‌మెడోస్ కాలనీ



100 కాలనీల్లో నేటికీ మట్టి రోడ్లే!

- శివారు కాలనీల్లో మౌలిక వసతుల లేమి
- డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ లేక ఇబ్బందులు

ఎల్‌బీనగర్ శివారు కాలనీల ప్రజల గోడును ఎవరూ పట్టించుకోవడం లేదు. కొన్ని ఏళ్ల తరబడి ఆయా కాలనీల్లో మట్టిరోడ్లే దిక్కుగా మారాయి. వర్షం వస్తే కాలనీలకు వాహనాలతో పాటు కాలినడకన కూడ వెళ్లే పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు. తాము ప్రతి సంవత్సరం జీహెచ్ఎంసీకి ఆస్తి పన్నులు చెల్లిస్తున్నా తమ సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శివారు కాలనీల్లో ఉన్న మట్టి రోడ్లు గుంతలమయంగా మారి రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. దీనికి తోడు వర్షం వస్తే రోడ్లన్ని బురదమయంగా మారుతున్నాయి. మట్టి రోడ్లలో ఇంటికి చేరాలంటే నరకప్రాయంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాలు కురిసినప్పుడు నీరు నిలిచి ద్విచక్రవాహనాలు జారి కిందపడిపోతున్నాయి. భారీ వాహనాలు ఆ రోడ్లపై వెళ్తే ఇరుక్కుని నానా తంటలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. -ఎల్‌బీనగర్

అధికారుల నిర్లక్ష్యం..

హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో సుమారు రెండు వందల కిలో మీటర్ల మట్టి రోడ్లు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో శివారు కాలనీల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇంటి అనుమతులు, ఎల్ఆర్ఎస్‌ల పేరుతో ప్రతి సంవత్సరం ఆస్తి పన్ను వసూలు చేస్తున్న అధికారులు మౌలిక వసతులు కల్పించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. పూర్తిస్థాయిలో కాలనీలలో నివాసాలు ఏర్పడిన మౌలిక సదుపాయాలు కలిపించకపోవడంపై కాలనీ సంక్షేమ సంఘాలు మండిపడుతున్నాయి. టాక్స్‌లు చెల్లించకుంటే ఆధికారులు భయభ్రాంతులకు గురిచేయడం తప్ప అభివృద్ధిపై ధ్యాస లేదని పలువురు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పాపిరెడ్డి కాలనీలో మట్టి రోడ్డు

తాగునీటి కొనుగోలు..

శివారు కాలనీల్లో చాలా కాలనీలకు ఇప్పటికి డ్రైనేజీ, తాగునీరు పైపులైన్ వ్యవస్థ సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వసతులు కల్పించాలని ఏళ్ల తరబడి అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం లేక నీరు కొనడానికి కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. కనీసం వర్షా కాలంలోనైన రోడ్లలో గుంతలను మట్టితోనైన పూడ్చాలని కాలనీల వాసులు కోరుతున్నారు.మౌళిక సదుపాయాలు లేక ఇళ్లను అద్దెలకిచ్చే పరిస్థితిలేదని, కాలనీల పరిస్థితి చూసి అద్దెలకు ఎవరూ రావడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

శివారు కాలనీల్లో డ్రైనేజీ,తాగునీరు సౌకర్యం లేకపోవడంతో రోడ్లు వేయడంలో ఆలస్యమవుతోంది. జలమండలి ఆధ్వర్యంలో తాగునీరు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలి. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో శివా రు కాలనీలలో సుమారు రెండు వందల కిలో మీటర్ల వరకు రోడ్లు వేయాల్సి ఉంది.ఇప్పటికే పలు కాలనీలకు రోడ్లు మంజూరు చేయడం జరిగింది. త్వరలో పనులు ప్రారంభిస్తాం.వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

-రమేష్‌బాబు, ఈఈ ఎల్‌బీనగర్ సర్కిల్-3

కష్టపడే కార్యకర్తలకు అన్యాయం



మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో గత కొన్నేళ్లుగా పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి గురువారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా ఇతర రాజకీయ పార్టీల నేతలు ఎన్ని ఇబ్బందులు సృష్టించినా పార్టీని నమ్ముకుని పార్టీ అభివృద్ధికి పని చేసిన నాయకులను నేడు విస్మరిస్తుండటం బాధాకరమన్నారు. మార్కెట్ కమిటీ, దేవాదాయ కమిటీల్లో ఏడాది క్రితం పార్టీలోకి వచ్చిన వలస నేతలకు ఇవ్వడంపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సైదాబాద్: విద్యార్థులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని సేఫ్ ఫౌండేషన్ అకాడమిక్ ఇన్‌చార్జ్ శ్రీను సూచించారు. గురువారం ఆయన ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి సింగరేణి కాలనీ, శంకేశ్వరబజార్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 250 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసి మాట్లాడారు. తరగతి గదుల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా వినాలన్నారు. ట్యూషన్ సెంటర్లకు వెళ్లి హోంవర్క్ చేయటం, పాఠ్యాంశాల్లోని అనుమానాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు.